క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోటిబాబు

బత్తలపల్లి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బత్తలపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, పార్టీ నేతలు శ్రీకాంత్, షేక్షావలి, కప్పల సుదర్శన్, సంద్రా రామకృష్ణ, ముసలప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

ధర్మవరం రూరల్: నాభూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబయ్య, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

ముదిగుబ్బ: మండల పరిధిలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన రహంతుల్లా జూన్ 11న గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ మృతుడి భార్య మల్లికాకు రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు. సోమవారం ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమె బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో మలకవేమల సర్పంచ్ రమణ, శ్రీనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పరిశీలన

తనకల్లు: తమ ఏజెన్సీ ప్రతినిధులు వినియోగదారుల ఇంటి వద్దకే వచ్చి గ్యాస్ కనెక్షన్లు పరిశీలించనున్నట్లు స్థానిక వినాయక భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కే. రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు రూ. 236, కొత్త భారత్ సురక్ష పైప్‌కు రూ. 190 కలిపి మొత్తం రూ. 426 చెల్లించాల్సి ఉంటుందని, వినియోగదారులు రూ. 350 చెల్లిస్తే చాలన్నారు. బయట దొరికే తెలుపు, ఆకుపచ్చ పైపులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడరాదన్నారు. వివరాల కోసం 08498-232696, 9963295295 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.


మొక్కల పెంపకంతో ఆరోగ్యం



జాతీయ గీతం ఆలపిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మొక్కలు పెంచడం వల్ల ఆరోగ్యంతో పాటు స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందని ఏపీఓ కుందానం ఆదెప్ప పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గరిశలపల్లి, తంబాపురం, పోట్లమర్రి గ్రామ పంచాయతీలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పచ్చతోరణం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం అమరవీరులను స్మరిస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జాతీయ జెండా ఎగురవేసి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచులు పద్మావతి, సానే జయచంద్రారెడ్డి, అక్కిం దామోదర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, చెన్నారెడ్డి, ఈశ్వరయ్య, పీల్డ్ అసిస్టెంట్లు సుధాకర్, నాగార్జున, రాము తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సిబ్బంది

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సెర్ప్ ఉద్యోగులు సోమవారం పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ తమ మూల వేతనంపై 23 శాతం పెంచి జీవన ప్రమాణాలు సీఎం మెరుగుపరిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,569 మంది, కదిరి నియోజకవర్గంలో దాదాపు 40 మంది లబ్ధి పొందుతారని సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాల కుట్రలను దీటుగా ఎదుర్కొందాం

- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి





సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ప్రతిపక్షాలు, పచ్చ మీడియా కుట్రలను దీటుగా ఎదుర్కొని, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా కృషి చేద్దామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో 6 మండలాల పరిధిలోని మండల, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటు రూ. లక్ష కోట్ల అభివృద్ధితో సమానమని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, తమ ప్రభుత్వంలో సిమెంట్ రోడ్లు పెద్ద ఎత్తున వేశామన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో రాయలసీమలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. రూ. 3 వేల కోట్లతో గోరంట్ల, ఓడీచెరువు మండలం కొండకమర్ల,పుట్టపర్తి మండలం బొత్తలపల్లి ,సాతర్లపల్లి, గంగిరెడ్డిపల్లి, నల్లమాడ మండలం రెడ్డిపల్లి గుండా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ముదిగుబ్బ–బుక్కపట్నం–గోరంట్ల మీదుగా 342 జాతీయ రహదారి పనులు కోడూరు తోపు వరకు 80 కిలోమీటర్ల మేర రూ.1,700 కోట్లతో ఇప్పటికే వేగంగా జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలు పూర్తి అయితే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 30 వేల ఇళ్లు మంజూరు చేశామని, మండలానికి సగటున రూ 5 వేల కోట్లు ప్రభుత్వం నుంచి ప్రజలు లబ్ధి పొందారని వివరించారు. కార్యక్రమానికి మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య నేతలు, ఆయా మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విజయదుందుభి మోగిద్దాం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కదిరి టౌన్: వచ్చే ఎన్నికల్లోనూ విజయదుందుభి మోగిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లోనూ కదిరిలో ముచ్చటగా 3వ సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఇన్సూరెన్స్ నమోదు ప్రక్రియను జిల్లాలోనే మొదటిసారిగా కదిరి నియోజకవర్గంలో పూర్తి చేసుకుంటున్నామన్నారు. వచ్చే నెల సెప్టెంబర్ 10 వరకూ గృహ సారథుల రిజిస్ట్రేషన్ ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే 93 సచివాలయాల పరిధిలో 280 మంది కన్వీనర్ల డేటాను నిక్షిప్తం చేయడం సంతోషకరమన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి 4 లక్షల మందికి పైగా యువతకు ఉపాధి కల్పించారన్నారు. నియోజవర్గంలో 135 గ్రామాలకు రహదారులు నిర్మించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలో పూర్తవుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రూ. 18 కోట్లతో నిర్మిస్తున్న భవనం పూర్తి కావస్తుందన్నారు. 4 అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించామని, నియోజవర్గంలో దాదాపు 100 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ తవ్వించి చెరువులకు నీటిని విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులున్నారు.

దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి



పురవీధుల్లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తదితరులు

ధర్మవరం అర్బన్: ఇది నా భూమి నా దేశం అనుకుంటూ ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం 'నా భూమి నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న ప్రతి వార్డు నుంచి వెయ్యి కేజీల ప్లాస్టిక్ సేకరించాలని, ఆర్పీలు, వలంటీర్లు, ప్రజలు, కౌన్సిలర్లు భాగస్వాములు కావాలని కోరారు. ఎవరు ఎక్కువ సేకరిస్తే వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు అందిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు 2 వేల కేజీల ప్లాస్టిక్ తీసుకువస్తే వారికి ఇదే తరహాలో నగదు బహుమతులు ఇస్తామని తెలిపారు. అనంతరం విశ్రాంత ఆర్మీ జవాన్లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి పలు లేఅవుట్‌లలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్‌లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'నా భూమి నా దేశం'

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ ఆవరణలో సోమవారం నా భూమి నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి జాతీయ జెండా ఎగురవేసి పైలాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాజ్యం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుని వారి జ్ఞాపకాలకు చిహ్నంగా మొక్కలు నాటడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా సాధిక్, వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి, కమిషనర్ శ్రీవారిబాబు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నారప్పగారిపల్లిలో..

అమడగూరు: ఓడీ చెరువు మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ, నారప్పగారిపల్లిలో సోమవారం అధికారులు నా భూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు చెన్నారెడ్డి, రమణారెడ్డి, వరదారెడ్డి, నంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా ఉంటాం

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టుచీరల వ్యాపారులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని పట్టుచీరల తయారీ సంఘం పట్టణ అధ్యక్షుడు గిర్రాజు రవి తెలిపారు. స్థానిక శమీనారాయణస్వామి ఆలయంలో సోమవారం పట్టుచీరల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కొన్ని రోజులుగా విజయవాడకు వెళ్లి అసోసియేషన్ తరఫున పోరాటం చేసి రూ.5 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. ఇందులో కొంతమందికి 10 శాతం వడ్డీతో బకాయిలను ఇప్పించామని వివరించారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని కూడా వసూలు చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. సంఘం గౌరవాధ్యక్షులుగా కలవల రాంకుమార్, పోలా వెంకటనారాయణ, ఉపాధ్యక్షులుగా నాగభూషణరెడ్డి, పోలా ప్రభాకర్, నీలూరి శ్రీనివాసులు, రంగం ఆది, కార్యదర్శిగా దత్త శివ, కోశాధికారిగా మురళీధర్, సహ కోశాధికారిగా హేమంత్‌కుమార్‌తోపాటు 10 మంది డైరెక్టర్లను ఎంపిక చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

తాడిమర్రి: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో ఏఓ రమాదేవి అధ్యక్షతన సోమవారం జరిగిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పతాకం ఎగురవేసి వందనం చేశారు. అలాగే దాడితోటలో సింగిల్‌విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, చిల్లకొండయ్యపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు జొల్లిరెడ్డి రామన్నలు జాతీయ జెండాను ఎగుర వేసి, పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటారు.ఎంఈఓ కృష్ణమోహన్, ఏపీఓ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు దివ్యాంగుడి యాత్ర

పుట్టపర్తి టౌన్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ సాధనకు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇచ్చాపురం నుంచి ఢిల్లీకి ట్రై సైకిల్ యాత్ర చేపట్టిన దివ్యాంగుడు ప్రసాద్ సోమవారం ఎస్పీని మాధవరెడ్డిని కలిశారు. యాత్ర చివరి దశకు చేరుకొందని, త్వరలో ఢిల్లీకి చేరుకుని ప్రధాని నరేంద్ర మోదీని కలిసి విషయం తెలియజేస్తానని చెప్పారు.

ఏకగ్రీవంగా వార్డు మెంబర్ల ఎన్నిక

నల్లచెరువు: మద్దిమడుగు గ్రామంలోని 3వ వార్డుకు లక్ష్మీదేవి, పి.కొత్తపల్లి గ్రామంలోని 10వ వార్డుకు వాసుదేవ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.రామకృష్ణ తెలిపారు. అనంతరం వారు కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

తనకల్లు: తవళం గ్రామ పంచాయతీ 6వ వార్డు ఏకగ్రీవమైంది. వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు మౌలాబాషా వార్డు సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

ఎన్పీకుంట: మండలంలోని ధనియానిచెరువు పంచాయతీ నాల్గవ వార్డు ఉపఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి గోపాల్‌నాయక్ తెలిపారు. నంద్యాల లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికైందన్నారు.

ఒక నామినేషన్ విత్‌డ్రా

తలుపుల: ఉదమలకుర్తి పంచాయతీలోని 4వ వార్డు ఎన్నికలలో ముగ్గురు నామినేషన్ వేశారు. సోమవారం సూర్యనారాయణ విత్‌డ్రా చేసుకోవడంతో, కోటకొండ రమాదేవి, రమేష్‌నాయుడు పోటీలో ఉన్నట్లు ఆర్‌ఓ శకుంతల తెలిపారు.

పోటీలో ఇద్దరు

గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లి 9వ వార్డుకు సంబంధించి సోమవారం నామినేషన్‌ల ఉపసంహరణ జరిగింది. 9వ వార్డుకు సభ్యురాలిగా నామినేషన్ వేసిన రమణమ్మ ఉపసంహరించుకుందని ఆర్‌ఓ సునిత తెలిపారు. డి.విజయ, ఎస్.లక్ష్మీదేవి పోటీలో ఉన్నట్లు చెప్పారు.

బరిలో ఐదుగురు

అమడగూరు: చినగానిపల్లి, అమడగూరు పంచాయతీల్లోని వార్డులో నిర్వహించనున్న ఎన్నికలకు 5 మంది పోటీలో ఉన్నారని ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. చినగానిపల్లిలో దేవరాజు, రవీంద్రరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అమడగూరులో నారాయణస్వామి, సూర్యనారాయణ పోటీలో ఉన్నట్లు తెలిపారు.

బాధితులకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

కనగానపల్లి: ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మృతి చెందిన కోనాపురం రాములమ్మ (60), నరసింహులు (65) కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. స్థానిక ఉప సర్పంచ్ రామాంజనమ్మ అత్తామామలైన రాములమ్మ, నరసింహులు ధర్మవరం సమీపంలో రైలు కింద పడి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి సాయంత్రం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, డైరెక్టర్ ప్రభాకర్, బీసీ ముత్యాలు, బండి రవి, సొప్పలయ్య, పి.ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మృతులకు ఎమ్మెల్యే నివాళి

నల్లమాడ: సీ.బడవాండ్లపల్లికి చెందిన బడా శివారెడ్డి (65)గుండెపోటుతో సోమవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య శాంతమ్మ, కుమారుడు పురుషోత్తంరెడ్డిని ఓదార్చారు. సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఎంసీ బయపరెడ్డి, సాతర్ల రామచంద్ర, డీలర్లు భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు పుల్లారెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు. అలాగే, వంకరకుంట గ్రామ సర్పంచ్ కుళ్లాయప్ప సోదరుడు తాడిపత్రి బావయ్య(67) ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని నీరు లేని తొట్టెలో ప్రమాదవశాత్తు పడ్డాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించి కొన ఊపిరితో ఉన్న ఆయన్ను చికిత్స కోసం రెడ్డిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బావయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. సర్పంచ్ కుళ్లాయప్ప,నాయకులు ఓబిరెడ్డి, ఎస్సీ విభాగం మండల అధ్యక్షులు చిన్న నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఇస్మాయిల్‌ఖాన్

ఎన్పీకుంట: మండల ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా పి.ఇస్మాయిల్‌ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సద్గురుడు సెలవుపై వెళ్లారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

ధర్మవరం అర్బన్: జాతీయ ఫెన్సింగ్ పోటీలకు శ్రీవాసవి జూనియర్ కళాశాల విద్యార్థిని రవిత్రేణి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తెలిపారు. త్వరలో గుజరాత్‌లో జరిగే జాతీయ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్‌లు భాస్కర్‌రెడ్డి, సోమిరెడ్డి ఆమెను అభినందించారు.

గద్దర్‌కు నివాళి

కదిరి అర్బన్: స్థానిక వికలాంగుల భవనంలో సోమవారం బహుజన ప్రజా పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. గద్దర్ నిష్క్రమణ యావత్ దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో హరిప్రసాద్, ఇర్ఫాన్, గోవిందు, సాయిశీనాతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

ఎన్పీకుంట: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ ఆదినారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు.

వైద్యసేవలు భేష్

అమడగూరు: గ్రామ సచివాలయాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలు భేషుగ్గా ఉన్నాయని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సెల్వి పేర్కొన్నారు. సోమవారం ఆమె చినగానిపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి అపర్ణ, సూపర్‌వైజర్ నాగమ్మ, 104 సిబ్బంది శ్రావణి, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యవాణి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: ఇందిరమ్మకాలనీకి చెందిన నరసింహులు (65) ఊజీమాత్రలు మింగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా పంట నమోదు

తలుపుల: పంట నమోదును పారదర్శకంగా నమోదు చేయాలని తహసీల్దార్ కే.శ్రీధర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏఓ షాదాబ్ అధ్యక్షతన వీఆర్‌ఓ, వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.